కథా నిలయం
3623
శ్రీకాకుళం

# దగా దగా

''నువ్విక్కడికొచ్చేముందు గోచీ పెట్టుకునే వుండేదానివన్న విషయం మరిచిపోకు. ఇక్కడికొచ్చి గోచీ తీసి చీర కట్టగానే పెద్ద నాగరికురాలి నయ్యానను కుంటున్నావే బాగ ఫోజులు పెట్టవడితివేంది?''

కసిగా కోపంగా అంది వత్సలాదేవి

అయినా అరుణ ముఖం అరుణవర్ణం దాల్చలేదు. తనను అవమానించాలని చూస్తున్న వత్సలాదేవిని నవ్వు ముఖంతోనే చూసింది.

''నాకిప్పటికీ గోచీ పెట్టుకోవాలనే ఉంది. వత్సలాదేవిగారూ... అలా ఉండడం అవమానంగానో, అనాగరికంగానో భావించడంలేదు. కాని ఈ గోదావరిఖనిలో మీలాంటి నాగరిక స్త్రీల మధ్య గోచీతో ఉండడం బాగుండదేమోనని ఇలా ఉంటున్నాను. అయినా మాకు గోచీ తీసి చీరకట్టుకునే అర్హత కూడా లేదంటారా దొరసానిగారు'' అంది అరుణ.

''నీ కారెడ్డాల మాటలు చాలుగానీ నువ్వు నాకు చెప్పాల్సిన అవసరమేం లేదు. ఒకప్పుడు మీ నాన్న మా పెదబాపుకు పాలేరన్న సంగతి మరచిపోకు. నువ్వింట్లో ఏం తినేదానివో కూడా నాకు తెలుసు...''

''నేను నా చిన్నతనంలో గడుకమాడే తిన్నాను. మా నాన్న పాలేరుండే బతికాడు. మా ఇల్లు మాలవాడలో వుంది. అందువల్ల నేనిప్పుడు నీవేంచెప్పినా విననంటావు. వత్సలాదేవిగారూ! నేను చెప్పాను కాబట్టి నచ్చడంలేదా? లేక నేను చెప్పే విషయాలే నచ్చడంలేదా?''

''ఏదైతేనేం ఎక్కడుండాల్సిన వాళ్లక్కడుండక ఫోజులెందుకు?''

''అంటే మీ దొరల కుటుంబాలవాళ్లు అలాగే దొరతనం నడిపిస్తూ వుండాలి. చాకిరీ చేసేవాళ్లు చాకిరీ చేస్తూనే వుండాలంటారు. మరలాంటప్పుడు ఊళ్లోనే ఉండక ఉద్యోగం వెతుక్కుంటూ ఇక్కడికెందుకకొచ్చినట్లు?''

''దొరతన మెక్కడేడ్సిందిపుడు. మీలాంటి అలగాజనాలు మాదే రాజ్యమని ఎగురుతుంటే ఇంకక్కడెవ్వలుంటున్నారు?'' ''అంటేమేం ఉద్యోగం చేయొద్దా ?''

''అని నేనన్నానా? మీరూ మేమూ అందరం పొట్ట చేతలబట్టుకొనే ఇక్కడికొచ్చి బతుకుతున్నాం. ఇక్కడ మా వారు ఆఫీసర్. మీవారు కార్మికుడన్న విషయం మరిచిపోకు. అట్లని మేం.

మీపై అధికారం చలాయిస్తామనీ కాదు. దానికి పూర్తిగా వ్యతిరేకిని నేను... స్త్రీల సమస్యలను దృష్టిలో పెట్టుకొనే నేను పనిచేస్తున్నాను. మీ వారితో గుట్కా మానిపించమని, గుట్కా వ్యతిరేక ఉద్యమంలో మాతో పాలుపంచుకొమ్మన్నందుకు మీకింత కోపమెందుకొస్తుంది? మేం చేసే దేమన్న పాడుపనా? లేక నేను చెప్పేదేమైనా తప్పా?''

''మా చెప్పొచ్చినవు తియ్యి...! మాకివన్నీ తెలుసు. ఆడవాళ్లను నువ్వు ఉద్ధరించవలసిన పనేంలేదు. అప్పుడేమో సారా పోరాటమని బజార్లకెక్కినవు... ఇప్పుడేమో గుట్కా అని ఎంతైనా బజార్లలో తిరిగే బుద్ధులేడికి పోతాయి? ఆడది తిరిగి చెడిందన్నారు... మగాడు తిరుగక చెడ్డాడంటారు. నువ్వు నాకేం చెప్పక్కర్లేదు...''

వత్సలాదేవి దిక్కు జాలిగా చూసింది అరుణ...

''వత్సలాదేవిగారు మిమ్మల్ని చూస్తుంటే నవ్వాలో ఏడ్వాలో తెలియడంలేదు. మీరు బతుకుతున్న పంజరం బతుకు గొప్ప బతుకను కుంటున్నారు. మీ కోసం ఎవరు పనిచేస్తున్నారో కూడా తెలుసుకోలేని స్థితిలో వున్నారు. మీరిక్కడ కూడా దొరసాని బతుకే బతుకుతానంటే బతకండి... కాని ఇతర్లు చేసే సామాజిక కార్యక్రమాల విలువేంటో తెలుసుకోవడానికైనా ప్రయత్నించండి'' అంది అరుణ.

''దొరసానులమో గిరసానులమో మేం మా మొగోల్లకే సానులం అయితే కావచ్చు. కాని మీలా అందరికీ సానులంకాదు.''

ఆ మాటలు హృదయశల్యంగానే వున్నాయి అరుణకు. స్త్రీయై వుండీ తనలాంటి వాళ్లనలా అంటున్న వత్సలాదేవి దిక్కు కోపంగా చూసింది అరుణ... అట్లని స్త్రీకి శత్రువు స్త్రీయే అనడమూ ఆమెకు నచ్చదు. అందులోనూ ఏదో కుట్ర వుందనిపిస్తుందామెకి... కొద్ది క్షణాలాగి

''వత్సలాదేవిగారూ! సామాజిక కార్యక్రమాల్లో తిరిగే స్త్రీలు మీకు చెడిపోయినవాళ్లలా కనబడటం చాలా బాగుంది... మీరు వంటింటికే పరిమితమై మీ తల్లులు, తాతమ్మలు బతికిన దొరసాన్ల బతుకే బతుకుతానంటే బతకండి... కాని మేం చెబుతున్నాం కాబట్టి మంచి విషయాలనైనా పట్టించుకోమంటే అది మీ మూర్ఖత్వమవుతుంది. మీ భర్తతో మీరు గుట్కా మాన్పించకుంటే మా ఉద్యమంలో భాగంగా బలవంతంగానైనా మాన్పిస్తాము. ఎలాగూ ప్రభుత్వం గుట్కాను నిషేదించే వరకు విశ్రమించము'' దృఢంగా అంది అరుణ.

''నువ్వేం చెప్పక్కర్లేదు. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సంపాయించి డిగ్రీ చేసిన్నని గర్వపడుతున్నావు. గోచీ పెట్టుకొనొచ్చిన వాళ్లకు డిగ్రీ చేతికొస్తే కండ్లకెవరు కనబడ్తారు? ఇలా బజార్ల కెక్కుతారు...''

తానెన్ని విధాల చెప్పినా తానుబట్టిన కుందేటికి మూడే కాళ్ళున్నట్టు ప్రవర్తిస్తున్న వత్సలాదేవిపై చికాకుగా వుంది అరుణకు. అయినా ఓర్పుతో ఆమెకో అవగాహన కల్గించడానికే ప్రయత్నం చేస్తుంది.

''వత్సలాదేవీ! ఊళ్లో నువ్వు చదివినదానికంటే తక్కువే చదివాను నేను.. నాకేమో అవకాశాల్లేక చదువలేదు. నువ్వేమో అన్ని అవకాశాలుండీ ఆపైన చదవలేదు. ఇక్కడ కొచ్చింతర్వాత సార్వత్రిక విశ్వవిద్యాలయం అవకాశాలను పయోగించుకున్నాను. డిగ్రీ సంపాదించుకున్నాను. నిన్ను డిగ్రీ సంపాదించుకుంటానంటే అడ్డుకున్న వాళ్లెవరు? డిగ్రీ వచ్చింతరువాత నాకండ్లేం నెత్తికెక్కలేదు. డిగ్రీ లేకున్నా

నేనిలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేదాన్నే. కాకపోతే చదువు నాకు మరికొంత అవగాహన పెంచుకోవడానికి ఇంకా పుస్తకాలుచదవడానికి అవకాశం కల్పించింది'' అంది అరుణ.

''ఏంటీ నీకున్న అవగాహన? అలగా జనాలను వెంటబెట్టుకొని దేశానునుద్ధరిస్తానంటూ తిరగడమేనా నువ్వు చేసేపని... మగవాళ్ల నెదిరించడం, బజార్ల వెంటపడటం మీకేం కొత్తగాదు. ఎంత చదువుకున్నా ఆ బుద్ధులెడికి పోతాయి?''

''భర్త ఏ పేధనిచేసినా పడి వుండటం పతివ్రతా ధర్మమంటావు కదా వత్సలాదేవి? చిన్న కులాల్లో మీ భాషలో అలగా జనాల్లో భర్త నెదిరించడం మామూలేనంటావు. అవును. మీలా తన్నులు గుద్దులు తింటూ పడివుండాల్సిన కర్మ మా వాళ్లకు లేదు. ఎందుకంటే మా కుటుంబాల్లో స్త్రీకూడా పురుషులతో సమానంగా పనిచేస్తూ సంపాదిస్తుంది. అవసరమైతే భర్తనెదిరిస్తుంది మా స్త్రీ. ఆవిధంగానైనా కొంతైనా వ్యక్తిత్వం కలిగి బతుకుతుంది. భర్త వదిలిపెడితే బతకడమెలాగన్న పిరికితనం మా వాళ్లలో ఉండదు. అందుకే మీకులేని స్వేచ్ఛ కొంతైనా మావాళ్లకుంటుంది.

నేను చేస్తున్న ఈ పనులు నీకు బరితెగించినవిగా కనపడితే నీకు జోహార్లర్పించడం తప్ప చేసేదేం లేదు. మన జీవితాల్లోని విషాదాలను గూర్చి చెప్పేందుకే తప్ప నేను నీపై ఏదో ఆధిపత్యం చేయడానికి కాదు. నీవలాగే బతుకుతానంటే బతుకు. నా భర్త నా అభిప్రాయాలను గౌరవిస్తాడు కాబట్టే నేనీ మాత్రంగానైనా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనగలుగుతున్నాను. నాకలాంటి భర్త దొరికినందుకు గర్విస్తున్నాను కూడా. నా జీవితం నాకేమాత్రం అవమానకరంగా లేదు. పైగా నేను చేస్తున్నవి గౌరవప్రదమైన పనులేనని నేను నమ్ముతున్నాను. నేను చెప్పేది చెప్పాను. తర్వాత నీ ఇష్టం'' అని లేచి నిల్చుంది అరుణ.

''నువ్వు చేసే పనులు నీకు గౌరవప్రదమైనవే... ఎందుకంటే ఆడది బజారుకెక్కడం గౌరవప్రదమే మీకు. వేషం, భాష మార్చి ఇంట్లో ఉండాల్సింది కాక బజార్లో పడి దేశసేవంటూ తిరుగుతున్నావు... సిగ్గులేదా? మళ్లీ నాకే చెప్పాలని వచ్చావు'' అంది కోపంతో వత్సలాదేవి.

''వత్సలాదేవి నీ మాటలు వింటుంటే నాకిప్పటికీ కోపం రావడంలేదు. పైగా జాలి కలుగుతుంది. ఇన్ని చెప్పినా ఈ కాలంలోనూ నాలాంటి వాళ్లు చేస్తున్న పనులు నీకు విచ్చలవిడి పనులుగా కనబడుతున్నాయంటే నీకు చెప్పడానికింకేం మిగలలేదు. ఓ నగ కోసమో, పట్టుచీరకోసమో, భర్త మెప్పుకోసమో వ్యక్తిత్వం చంపుకొని బతికే బతుకే గొప్ప బతుకనుకుంటే అలాగే బతుకు. ఈ కృత్రిమ విలువల ఊబిలో కొట్టుకుపోవడం ఇష్టమైతే అలాగే ఉండు. కాని ఎన్ని అడ్డంకులెదురైనా నా పని నేను చేసుకు పోతాను. అందుకు నా భర్త సహకారం వుండనే ఉంటుంది'' అని అక్కణ్నుంచి వెళ్లిపోయింది. అరుణ.

★★★

పడక కుర్చీలో కూర్చుని స్త్రీవాద ఉద్యమాల గూర్చి ఆలోచిస్తున్న అరుణకు నెలరోజుల క్రితం జరిగిన వత్సలాదేవి సంఘటన జ్ఞాపకం వచ్చింది.

''అరుణా! ఇప్పుడు వస్తున్న స్త్రీవాద ఉద్యమాలు చాలా వరకు మధ్య తరగతి స్త్రీ దృష్టి కోణంలోంచి వస్తున్నవే. వస్తున్న చాలా సాహిత్యమూ అంతే... ఇది అట్టడుగు స్త్రీ దృష్టికోణంలోంచి కూడా చూడబడ్డప్పుడే ఈ ఉద్యమాలకు పరిపూర్ణత వస్తుంది'' అన్న భర్త మాటలను జ్ఞాపకం చేసుకుంది.

విశ్రాంతిగా కూర్చున్న ఆమె కళ్ళముందెన్నో దృశ్యాలు కదులుతున్నాయి. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టింది అనుమమ్మ. ఆమె తండ్రి పాలేరుగా బతుకుతున్నాడు. తల్లి కూలి పనులు చేస్తుంటుంది. అన్నలిద్దరూ పాలేర్లుగానే జీవితం గడుపుతున్నారు.

ఆ కుటుంబ పేదరికం, కులం ఆమెను చక్కని చుక్కలా ఉండడాన్ని మాత్రం ఆపలేదు. చిదిమి దీపం పెట్టుకోవచ్చునేటట్టున్న అనుమమ్మను చదివించాలనుకున్నాడామె తండ్రి. అప్పటికే ఊళ్లో దళిత కుటుంబాలవాళ్లు చాలామందే చదువుకుంటున్నారు. ఊళ్లో వున్న అప్పర్ ప్రైమరీ స్కూలు వరకు చదివించారు. పొరుగూరుకో, పట్టణానికో పంపి చదివించే ఆర్థిక స్థోమత ఆ కుటుంబానికి లేదు. అనుమమ్మ చదువాపడం ఎవరికీ ఇష్టం లేకున్నా ఆపక తప్పలేదు.

తల్లితో కూలిపనికి పోయేది అనుమమ్మ. కలుపు, నాటు తీస్తున్న సమయంలో గెట్టుపై నిల్చుని స్త్రీలను తినేట్టు నఖశిఖ పర్యంతం చూచేవారు యజమానులు. కొందరిపై సెక్సు దోపిడీ జరగడం చూసిందామె.

ఓరోజు తల్లితో అంది అనుమమ్మ.

''అమ్మా! నన్నారెడ్డి తినేసేటట్టు చూస్తున్నాడు. నాకు వాన్ని చూస్తేనే భయమౌతుంది. ఏం జేయాలి'' అంది.

''ఇప్పుడు కొంత నయమమ్మ. ఇంతకుముందయితే ఏ దళిత స్త్రీ కూడా దొరల కంట్లో పడి శీలం కాపాడుకున్నది లేదు.

నువ్వు కొంతైనా చదువుకున్నావు. ఏదైనా మంచి సంబంధం కుదురుతే పెళ్లి చేయాలనుకుంటున్నాం'' అందామె తల్లి.

అప్పుడప్పుడే కొంత కొంత ఆలోచించే వయసులోకి అడుగుపెడ్తున్న అనుమమ్మ తమ కుటుంబాల్లోని ఎన్నో విషయాలను గమనిస్తుంది.

పొద్దంతా పురుషుడితోపాటు పనులు చేయాలి స్త్రీలు. ఇంటిపనులు సాధారణంగా స్త్రీలేచేస్తారు. కొందరు తాగుబోతు భర్తలు తాగొచ్చి కొట్టినా ఇంటిని పట్టించుకోకున్నా బాధ్యతలు స్త్రీయే భరించాలి. అయితే అవసరమైతే స్త్రీ దెబ్బకు దెబ్బన్నట్టు తిడితే తిట్టేది. భరించరాకుండా ఉంటే విడాకులు తీసుకొని వెళ్లిపోయేది. మరో పెళ్లి చేసుకోవడం పెద్ద సమస్యగా ఉండేది కాదు.

కుటుంబం కోసం ఎంతో కొంత సంపాదించే స్త్రీలలో ఆత్మవిశ్వాసం ఉండటం గమనిస్తుందామె.

ఉద్యమాలు గ్రామాల్లో చాలా మార్పులను తీసుకొస్తున్నాయి. విజయ్‌ది ప్రక్క గ్రామం. దళిత కులానికి చెందినవాడే. ప్రభుత్వోద్యోగంలో వున్నాడు. అతడే ఓ రోజు స్వయంగా వచ్చి అనుమమ్మను పెళ్లి చేసుకుంటానన్నాడు. అది తమ అదృష్టంగానే భావించారామె తల్లిదండ్రులు. అనుమమ్మ పేరును అరుణగా మార్చాడు.

ఆమెను పెళ్లి చేసుకొని తనతో తీసుకెళ్లాడు.

విద్యావంతుడు, సంస్కారియైన విజయ్‌తో ఆమె కాపురం సుఖంగానే సాగుతుంది.

''అరుణా! చిన్నినా పొట్టకు శ్రీరామరక్షనుకుంటూ మాత్రమే బతకడం నాకిష్టంలేదు. స్త్రీ అయినా పురుషుడైనా కొంతైనా సమాజానికుపయోగపడాలి'' అన్నాడు విజయ్ ఓరోజు.

భర్త మాటల గూర్చి ఆలోచిస్తుంది అరుణ.

''అరుణా నువ్వు చదువులో చురుకైనదానివని నాకు తెలుసు... అవకాశాల్లేక అప్పుడు చదువుకోలేక పోయావు. ఇప్పుడు గృహిణిగా వుంటూనే డిగ్రీ తీసుకోగలిగే అవకాశాలున్నాయి. ఓపెన్ యూనివర్సిటీ అవకాశాన్ను పయోగించుకొని డిగ్రీ సంపాదించుకో. నీకన్నివిధాలా నా సహకారం వుంటుంది''.

భర్తపై మరింత గౌరవం పెరిగింది అరుణకు.

ఎలిజిబిలిటీ పరీక్షపాసై డిగ్రీలో చేరింది.

డిగ్రీ పుస్తకాలతోపాటు అనేక పుస్తకాలను చదువుతుంది. సహజంగా మంచి ఇంటలిజెంటయిన అరుణకు ఇవేవీ పెద్ద భారం కాలేదు.

స్త్రీవాద ఉద్యమాలు ఉధృతంగా సాగుతుండడం గమనించిందామె. వాటిపై ఓ అవగాహన ఏర్పరచుకుంది. ఓ దిక్కు చదువుకుంటూనే స్త్రీల పక్షాన నిలిచిపోరాటాలు చేయడానికి నిర్ణయించుకుంది. విజయ్ ప్రోత్సాహమామె కుండనే వున్నాయి.

ఆ కాలనీలో, చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడ స్త్రీ సమస్యలుంటే అక్కడకి వెళుతుంది అరుణ. ఆమెకు తోడు నలుగురైదుగురు ఆడాళ్లున్నారు.

ఆ ప్రాంతంలో సారా వ్యతిరేక పోరాటంలో ప్రముఖ పాత్రే వహించింది. ఇటు డిగ్రీ పూర్తి చేసింది అరుణ. ఆ ప్రాంతంలో ఎంతోమంది స్త్రీలకు తలలో నాల్కయింది. మగవాళ్లు కొందరికి సింహస్వప్నమే అయింది. వత్సలాదేవి లాంటి కొంతమంది స్త్రీలామెను బరితెగించిన స్త్రీగా చెప్పుకుంటున్నా ఆమె పనులామె చేసుకుంటూ పోతూనే వుంది....

''భార్యను జొన్నెకిడిసిపెట్టాడు విజయ్...''

''ఆ బుద్దేడికి పోతుంది?''

కొందరు సూటిపోటిగా చాటుమాటుగా అంటున్నా లక్ష్యపెట్టడంలేదు.

ఎంతోమంది స్త్రీల కాత్మబంధువుగా ఆ ప్రాంతంలో ఓ శక్తిగా రూపొందిన అరుణ వత్సలాదేవి లాంటి వాళ్లకింకా బరితెగించిన స్త్రీగానే కనబడటం ఆమె కాశ్చర్యంగానే వుంది.

''అక్కా అరుణక్కా?'' అంటూ ఇంట్లోకి ప్రవేశించిన పదేళ్ల పాప మాటలతో ఈలోకంలో కొచ్చింది అరుణ...

''ఏంటమ్మా ఏం జరిగింది?'' అంది.

''అరుణక్కా! ఆగయ్య షావుకారు చనిపోయింది తెలుసుగదా! పొద్దున పోయి చూసొచ్చావు కదా! శవాన్నక్కడే ఉంచి కొట్లాడుతున్నరు. నిన్ను తీసుకురమ్మని చెప్పింది షావుకారమ్మ'' అందా పాప.

ఒకప్పుడు తనను వ్యతిరేకించిందే అయిన షావుకారమ్మ ఇప్పుడు తనను పిలవడం వింతగానే అనిపించిందరుణకు... ఎంత సాంప్రదాయవాదులైనా తమ కాళ్లకిందికి నీళ్లొస్తే ఆ సాంప్రదాయాన్నే ఎదిరించడానికి వెనుకాడక పోవడం అరుణ ఎన్నోసార్లు చూసింది.

''సరేనేను వస్తున్నాను... సంధ్యక్కను, రాజక్కను తీసుకొనిరా...'' అనగానే ఆ అమ్మాయి పరుగెత్తుకుంటూ వెళ్లింది.

అరుణ అక్కడికెళ్లేసరికి వాతావరణమంతా కురుక్షేత్రంలా వుంది. శవం చుట్టూ జనాలు. ఆగయ్య భార్య లక్ష్మీదేవి ఏడ్చిఏడ్చి అలసిపోయినట్టుంది. ఆగయ్య తమ్ముని కొడుకు కారాలు మిరియాలు

నూరుతున్నాడు. ఆగయ్య అన్న, తమ్ముడు అటూ ఇటూ తిరుగుతున్నారు.

''ఈమెగారిక్కడికెందు కొచ్చినట్టు? ఈమెనెవరు పిలిచారు?''

''తగుదునమ్మా అని ఎక్కడికిబడితే అక్కడికొస్తుంది.''

''రావద్దా? వస్తేంటి? ఆమె కొచ్చే హక్కులేదా?''

''వాళ్లకేం తెలుసని సాంప్రదాయం సంగతి... ఆ కులం వాళ్లకు''

''కులం పేరెత్తి మాట్లాడితే జైలు తప్పదు. జాగ్రత్త...''

అరుణ అక్కడికి రావడం చూసి ఆమెకు మద్దతుగా, వ్యతిరేకంగా మాట్లాడుకుంటున్నారు జనాలు..

లక్ష్మీదేవి భోరుభోరున ఏడుస్తుంది.

ఆమె దగ్గరకెళ్లి ఊరుకోబెట్టింది అరుణ.

''ఏంటి? తెల్లవారకముందే చనిపోయాడు కదా ఆగయ్యగారు. మధ్యాహ్నం దాటుతుంది. ఇంకా శవాన్నిలాగే ఎందుకుంచుతున్నారు?'' ఇంకెవరైనా వచ్చేదున్నదా? ఏం జరిగిందసలు?'' అంది అరుణ.

''ఏం లేదు అగ్గిపట్టే విషయంలో సమస్యొచ్చింది'' ఒకతనన్నాడు.

''ఇందులో సమస్యేముంది? అగ్గి ఎవరో ఒకరు పెడతారేముంది? అయినా షావుకారికి భార్యుంది కదా?'' అంది అరుణ.

''ఆడదెలా అగ్గిపెడుతుంది? షావుకార్లిండ్లలో స్త్రీలు శవం వెంట రారు. శవంతోని పోయి దహనం చేసేది మగవాళ్లే'' అన్నాడు ఆగయ్య అన్న.

శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతి, ఉవ్వెత్తున లేస్తున్న ఉద్యమాలు ఇవేవీ స్త్రీల మౌలిక సమస్యలను పరిష్కరించలేవా? తాను ఏళ్ల తరబడి కలిసి సహజీవనం సాగించిన భర్తవెంట స్త్రీ పోవద్దనడం ఎంతన్యాయం? భర్త శవం వెంట స్త్రీ పోవడం సాంప్రదాయ విరుద్ధమా? తనలో తాననుకుంది అరుణ.

''ఏం భార్య అగ్గిపడితే కర్మచేస్తే ఆయనగారికి మోక్షం రాదా? భర్త శవంతో బయటకు నడిచినంత మాత్రాన వంశగౌరవ ప్రతిష్టలు నాశనమవుతాయా? ఇది ఏ శాస్త్రంలో ఉంది?'' అంది కోపంగా అరుణ.

''ఇక్కడ అగ్గిపట్టడం కాదు సమస్య. అగ్గిపట్టి ఆస్తిని దొబ్బుదామని చూస్తున్నాడు వీరేశం. ఆగయ్యకు సంతానం లేదుకదా! సంపాదించిన ఆస్తి బాగానే వుంది. ఆ ఆస్తికోసం ఈ వేషాలన్నీ...'' అన్నాడో యువకుడు.

''అందులో తప్పేముంది? ఈరోజు అగ్గిపట్టి కర్మ చేసేది వీరేశం. ఆస్తికతనే వారసుడవుతాడు. వీరేశం ఆగయ్య తమ్ముని కొడుకే కదా! అతని వంశాన్ని మోస్తున్నవాడు'' అందో వృద్ధురాలు.

''ఏం ఆస్తి లక్ష్మీదేవికి చెందక వీరేశంకెందుకు చెందుతుంది? ఆమె ఆగయ్య భార్యేకదా? పైగా ఆమె ఓ పాపను కూడా పెంచుకుంటుంది'' అంది సంధ్య.

''ఆడదానికి ఆస్తి చెందడమేంటి? ఆ సాదుకున్న పిల్లను పంపిద్దాం. అంత ఇష్టమయితే నేనే పెళ్ళి చేస్తాను పెరిగింతర్వాత. మా పెద్దమ్మను నేనే పోషిస్తాను. ఇంకామెకు ఆస్తెందుకు? మా పెద్దనాన్నకు సంతానం లేదు. ఈ పెదనాన్నకు సంతానం లేదు. మూడు ఆస్తులకు నేనే వారసున్ని. ముగ్గురి వంశాన్ని మోసేది నేనే. నాకే ఆస్తి చెందుతుంది. అందువల్ల నేనే అగ్గిపట్టి కర్మ చేస్తాను'' అన్నాడు వీరేశం.

''అవును... అవును'' అన్నారు చాలామంది.

''మూడు కుటుంబాలకు వంశాంకురం వీరేశమే... ఆస్తి అతనికి కాక మరెవరికి పోతుంది. ఆడదానికి ఆస్తెందుకు? ఆమె అన్ని అవసరాలు తీర్చితే సరిపోతుంది.''

''ఎంతైన మగవాడు మగవాడే. లక్ష్మీదేవికి ఆమె సాదుకుంటున్న పాపకు తిండి పెడితే సరిపోతుంది. ఇంకేం కావాలి?''

''ఎవరి వంశం వాళ్ల ఆస్తి వాళ్లకే చెందుతుంది. తండ్రి వంశాన్ని మోసేది మగవాడే...''

రకరకాలుగా మాట్లాడుతున్నారు. శవమక్కడ వుండగానే చర్చలు జరుగుతున్నాయి. చాలామంది వీరేశం వాదననే సమర్థిస్తున్నారు. అందులో స్త్రీలు కూడా ఎక్కువగానే వుండటం గమనించింది అరుణ.

''వీరేశంగారూ అంత వంశాన్ని మోసేవాడివైతే మీ పెదనాన్న మంచంలో పడున్నప్పుడు ఎందుకరుసుకోలేదు? ఏడాదిగా ఆతనితో నానా యాతనలు పడింది లక్ష్మీదేవి. అప్పుడెటుపోయింది వంశాంకురం ఆలోచన. చనిపోయింతర్వాత శవాన్ని ముందు పెట్టుకొని ఆస్తుల గురించి మాట్లాడటానికి సిగ్గులేదా?''

అరుణ అనగానే సంధ్య రాజమ్మ మరికొంత మంది స్త్రీలు, యువకులు ఆమెకు మద్దతుగా నిలిచారు.

''ఇన్రోజులు ఇటు మొకమయినా చూడనివాడు పెదనాన్న చనిపోగానే అగ్గిపడతానని ఉరికొచ్చాడు. కర్మచేస్తాడట కర్మ'' అంది సంధ్య.

''పిల్లలు లేకపోయిన తర్వాత ఆస్తెందుకు? ఆమెను తిండి బట్టకు అరుసుకుంటే సరిపోతుందికదా'' అన్నాడు వీరేశం తండ్రి.

ఆ మాటనే సమర్థించాడు అతని అన్న.

''అంటే తన జీవితాన్నంతా అర్పితం చేసిన లక్ష్మీదేవికి ఆస్తవసరం లేదంటారు... ఇరవై ఏళ్లు కలిసి కాపురం చేసి రెండో భార్యగా ఎన్నో అవమానాలు పొందిన లక్ష్మీదేవి ఆస్తినంతా మీకిచ్చి తిండికోసం మీమీద ఆధారపడి వుండాలంటారు. ఓ పాపను పెంచుకుంటున్నా ఆ పాప వంశాన్ని మోయదు కాబట్టి ఆస్తి చెందకూడదంటారు? స్త్రీకి ఆస్తి వద్దని ఏ ధర్మశాస్త్రాల్లో రాసుంది? ఒకవేళ ఎక్కడైనా రాసున్నా వాటిని తగులబెట్టాలి'' అంది కోపంగా అరుణ.

''ఆగయ్యను చూసిరాలేదామె. అతని ఆస్తిని చూసే పెళ్ళి చేసుకుంది'' అంది ఓ స్త్రీ.

''అవును పైగా ఆమెకు సంతానం కూడా లేదు'' అన్నాడు వీరేశం.

''సాదుకుంటే అది సంతానం కాదా? అయినా సంతానం లేనంత మాత్రాన ఆస్తి భార్యకు కాక మరెవ్వరికో ఎందుకు పోతుంది? ఆగయ్య స్వార్జితమైన ఆస్తి ఆతని కష్టసుఖాల్లో పాలుపంచుకున్న అతని భార్యకే చెందుతుంది. మీకంతగా మీ ఆస్తిని ఎవరికీ చెందనివ్వకూడదనుకుంటే లక్ష్మీదేవి రెండో భార్యగా తెచ్చుకుంటున్నప్పుడే ఎందుకాపలేదు? నలభై ఐదేళ్లు దాటిన వ్యక్తి మొదటి భార్యకు సంతానం లేదని ఇరవై ఏళ్లయినా నిండని లక్ష్మీదేవిని చేసుకున్నప్పుడు మీ తెలివెక్కడపోయింది? అప్పుడే అడ్డుకొనుంటే ఇప్పుడు లక్ష్మీదేవికీ పరిస్థితి వచ్చుండేది కాదుకదా! నలభై ఏళ్లు కూడా లేని లక్ష్మీదేవి జీవితాంతం నీపై ఆధారపడి బతకాలంటావా వీరేశంగారూ?'' అంది వీరేశంను చూస్తూ అరుణ.

''సంతానం లేకుంటే ఏ వయసులోనయినా మరో పెళ్లి చేసుకోవడం మామూలేనాయె. ఇందులో తప్పేముంది?'' అన్నాడు ఆగయ్య అన్న.

''అలాంటప్పుడు తన ఆస్తిని తనతో జీవితం పంచుకున్న వాళ్లకివ్వడం తప్పెలా అవుతుంది? ఈ ఆస్తి ఖచ్చితంగా లక్ష్మీదేవికే చెందుతుంది. ఆమె కిష్టముండీ అందులో కొంతభాగం వీరేశంకుకాని ఇంకెవర్రికైనాగాని ఇచ్చుకుంటే ఇచ్చుకోవచ్చు'' ఖచ్చితంగా అంది అరుణ.

ఆమె మాటలను సమర్థిస్తూ కొంతమంది యువకులు ముందుకొచ్చారు.

''ఆస్తి సంగతి తర్వాతగాని ముందు శవమైతే లేవనివ్వండి''

''స్త్రీ అగ్గిపడితే మోక్షంరాదు. స్త్రీ ఖర్మచేసినా పున్నామనరకం తప్పదు. అగ్గిపట్టడం, కర్మ చేయడం స్వంత కొడుకుకాని తన వంశంవాడుకాని చేయాలి. ఈ సాకుతో ఆస్తిలో భాగమో, మొత్తమో కొడ్దామని చూస్తున్నాడు. వీరేశం అతనికా అవకాశమివ్వడం ఇష్టంలేదు లక్ష్మీదేవి. ఈ పంచాయతీ తేలేదెట్లా? పొద్దట్నుంచి ఇదేగోల పొద్దు వంగుతోంది. త్వరగా శవదహనమయిపోవాలి. చలికాలం స్నానాలు చేయడం కష్టమవుతుంది'' అన్నాడు పెద్ద మనిషొకాయన.

''పున్నామ నరకం నుండి తప్పించడానికి కొడుకే కావాలన్నమాట. ఏం స్త్రీకి ఆ శక్తిలేదా? ఆ పున్నామ నరకాన్ని స్వర్గాన్ని ఎవరు చూసొచ్చారు? సరే... ఇప్పుడవన్నీ ఎందుగ్గాని అసలు సంగతి చూద్దాం'' అని వీరేశం దిక్కు తిరిగింది అరుణ.

''వీరేశంగారూ నీకు మీ పెదనాన్నను పున్నామ నరకం నుండి తప్పించాలన్న సదుద్దేశమే ఉంటేనువ్వే అగ్గికుండ పట్టుకొని శవం ముందు నడువు. చితికి నిప్పు నువ్వే పెట్టు. ఇతర కర్మకార్యక్రమాలన్నీ చేయి. అంతమాత్రాన నీకు మీ పెదనాన్న ఆస్తిలో చిల్లిగవ్వకూడా రాదు. లక్ష్మీదేవి ఇష్టమయి ఇస్తే ఇవ్వొచ్చు. లేకుంటేలేదు. ఇక నువ్వు కర్మ చేస్తావో ఏం చేస్తావో చెయ్యి. ఓ కాగితం, కలం తీసుకురండి.. నేను చెప్పిన విషయాలు రాసి సంతకాలు తీసుకుందాం. ఆస్తి లక్ష్మీదేవికెందుకు చెందదో నేను చూస్తాను. ఎంత దూరమైనా పోతాను.''

అరుణ మాటలను సమర్థించారు కొందరు.

వీరేశంను సమర్థిస్తున్న వాళ్లు కొంత వెనుకకు తగ్గారు.

''ఒక్క పైసా కూడా ఆస్తి రానప్పుడు అగ్గిపట్టడం దేనికి? కర్మ చేయడమెందుకు? ఉత్త బొక్కలకు కొండ్రిగాడాశపడ్డట్టు'' అన్నాడు వీరేశం.

''ఇప్పుడు తెల్సిందికదా వీరేశం దురుద్దేశ్యం? కర్మ చేసినట్టు చేసి ఆస్తి కొట్టేద్దామని చూసాడు'' అన్నాడో యువకుడు.

అక్కడున్న వాళ్లంతా ఏవేవో మాట్లాడుతున్నారు.

చాలామంది మగవాళ్లకే ఆస్తి చెందాలన్న విషయాన్ని సమర్థిస్తున్నారు.

కొంతమంది యువకులు, మగసంతానం లేనివాళ్లు కొందరు అరుణలాంటి వాళ్లంతా లక్ష్మీదేవిని సమర్థిస్తున్నారు.

శవం లేచే సూచనలు కనబడటంలేదు.

''ఆస్తి అవసరం లేదు. కర్మని చేస్తానన్న వీరేశంను చేయనీయొద్దు. దీన్నాధారంగా చేసుకొని ఆ తర్వాత ఆస్తికోసం కిరికిరి పెడతాడు.. లక్ష్మీదేవి అగ్గిపట్టి కర్మ చేస్తే ఆయనగారికి మోక్షం రాకుండా పోదు. ఆమే అగ్గి పడుతుంది'' అంది రాజమ్మ.

''ఆడవాళ్లు శవంవెంట రావడమేంటి''

''ఏం ఆడవాళ్లు మనుషులు కారా? శవం వెంటొస్తే మునిగిపోయేదేంటి? లక్ష్మీదేవే అగ్గిపట్టుకొని ముందు నడుస్తుంది. ఎవ్వరాపుతారో మేం చూస్తాం... ఒకరు వెళ్లి పోలీసులను తీసుకురండి'' అంది సంధ్య.

వీరేశం వాళ్లకు ఇంకెలా ప్రతిఘటించాలో తెలియడంలేదు.

''లక్ష్మీదేవే అగ్గిపడుతుంది. చితికి నిప్పుపెడుతుంది. కర్మకార్యక్రమాలేవైనా వుంటే చేస్తుంది. తన భర్త ఆస్తిననుభవిస్తుంది. తన ఇష్టమైతే ఇష్టమున్న వాళ్లకిస్తుంది. ఇవన్నీ చేయడానికి మగవాడే కానక్కర్లేదు. స్త్రీకే అన్ని అర్హతలున్నాయి. లక్ష్మీదేవికి మా మహిళా సంఘం పూర్తి మద్దతునిస్తుంది. ఈ సమస్యనెంత దూరమైనా తీసుకెళ్తాం. శవాన్ని లేపండి'' అని ముందుకొచ్చింది అరుణ.

ప్రతిఘటించాలనున్నా వాళ్ల శక్తి తెలుసు. కాబట్టెవరూ ముందుకు రాలేదు. ఆ ప్రయత్నాన్నడ్డుకుందామనుకున్న కొందరి యత్నాలు ఫలించలేదు.

పాడె లేచింది. ఇద్దరు స్త్రీలు ఇద్దరు పురుషులు శవాన్ని మోస్తున్నారు. అగ్గికుండతో లక్ష్మీదేవి శవం ముందు నడుస్తుంది.

షావుకారు కుటుంబంలోని స్త్రీ అగ్గికుండ పట్టుకొని శవం ముందు నడవడాన్ని వింతగా చూస్తున్నారు జనాలు.

శవం వెంట నడుస్తున్న అరుణకు సమాజంలో వేళ్లూనుకొనున్న పితృస్వామ్య భావజాలం పునాదులు, మగ దురహంకారం కళ్లముందు కదుల్తున్నాయి. వాట్ని ఛేదించాలంటే మరింత కఠినంగా ప్రవర్తించక తప్పదనుకుంది అరుణ.

భోజ్యేషు మాతా, కరుణేషుమంత్రి అంటూ స్త్రీని బుజ్జగిస్తున్నట్టనడం దగాగానే కనబడుతుంది అరుణకు. ఈ సంఘటన స్త్రీ మరింత పోరు సల్పాల్సిన ఆవశ్యకతను అరుణకు గుర్తు చేస్తుంది.

*మేఘన మాసపత్రిక నవంబర్ '98*

44 45

46 47

# సగటు మనుషులు

